సీఎం రేవంత్‌రెడ్డికి కురుమల సత్కారం



ఉప్పల్: సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్ర కురుమ సంఘం ప్రతినిధులు ఆయన నివాసంలో కలిసి గొంగడి, కురుమ రుమాలతో శనివారం ఘనంగా సత్కరించారు. ఈనెల 29న గాంధీభవన్‌లో నిర్వహిస్తున్న కురుమల ఆత్మీయ సమ్మేళనం, హైదరాబాద్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రథమ అధ్యక్షుడు, గాంధీభవన్ వ్యవస్థాపకులు కొల్లూరి మల్లప్ప చిత్రపటం ఆవిష్కరణకు ఆహ్వానించారు. అనంతరం వాల్‌పోస్టర్లను సీఎం చేతుల మీదుగా ఆవిష్కరించారు. టీపీసీసీ కార్యదర్శి కొత్త కురుమ శివకుమార్, సంఘం రాష్ట్ర యూత్ అధ్యక్షులు తూముకుంట అరుణ్‌కుమార్ హైకోర్టు న్యాయవాది, రాష్ట్ర కురుమ సంఘం కార్యదర్శి గౌరిగే మల్లేష్, మంత్రి సుభాష్ , జేఏసీ నాయకులు పాండు, జశ్వంత్ ఇతర జిల్లాల కురుమ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు



బోడుప్పల్: విద్యార్థులు ప్రణాళికతో చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధిస్తారని జేజీఆర్ ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ గంగరాజు అన్నారు. బోడుప్పల్ బృందావన్ కాలనీలో శనివారం జేజీఆర్ ఉన్నత పాఠశాల 2023–24 సంవత్సర వార్షిక ఫలితాలను వెల్లడించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రమశిక్షణ, అంకితభావం, విలువలతో కూడిన విద్యతో పాటు అన్ని రకాల క్రీడల్లో ప్రోత్సహిస్తున్నామని వివరించారు. విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత స్థానాల్లో ఉన్నారని వెల్లడించారు. పాఠశాల ఇన్‌చార్జి విజయకుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల స్నాతకోత్సవం



మేడిపల్లి: విద్యార్థులు నిరంతర శ్రమ, అంకిత భావానికి నిదర్శనం 'కాన్వొకేషన్ డే' జీవితంలో మరిచిపోలేని జ్ఞాపకంగా నిలిచిపోతుందని, సాధించిన విజయాల అనుభూతిని కల్పించే సదవకాశమని జాహ్నవి విద్యాసంస్థల చైర్మన్ ఎ.పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. జాహ్నవి పీజీ, డిగ్రీ కళాశాల కాన్వొకేషన్ డే వేడుకలు శనివారం బోడుప్పల్ బ్రాంచ్‌లో ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థ వైస్ చైర్‌పర్సన్ లక్ష్మి, కళాశాల ప్రిన్సిపల్ శిల్ప, అధ్యాపక బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌకూర్‌లో కాంగ్రెస్ కార్నర్ మీటింగ్‌కు సీఎం

అల్వాల్: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మల్కాజిగిరి అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డికి మద్దతుగా కౌకూర్‌లో ఆదివారం సాయంత్రం 7 గంటలకు కాంగ్రెస్ నిర్వహించ తలపెట్టిన కార్నర్ మీటింగ్‌కు సీఎం రేవంత్‌రెడ్డి హాజరుకానున్నారు.

ఘనంగా ఆలయ వార్షిక మహోత్సవం



అల్వాల్: కానాజీగూడలోని మరకత శ్రీలక్ష్మీగణపతి దేవస్థానంలో అష్టమ వార్షిక బ్రహ్మోత్సవాలు రెండోరోజు శనివారం ఘనంగా నిర్వహించారు. సంకటహర చతుర్థిని పురస్కరించుకుని ప్రత్యేక హోమాలు, స్వామివారికి సుప్రభాత సేవ, విశేష అభిషేకం నవగ్రహ పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిప్యూటీ కలెక్టర్ తెలంగాణ స్టేట్ సెక్రటేరియట్ చంద్రకళ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వ్యవస్థాపకులు సత్యనారాయణశాస్త్రి, ఆరజ్యోతి, శ్రేయ, సిద్దు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

ఫోర్జరీ కేసులో మరో ఇద్దరి రిమాండ్

చర్లపల్లి జైలుకు తరలింపు

కుషాయిగూడ: ఓ ప్లాట్‌ను ఫోర్జరీ చేసి విక్రయించిన కేసులో ఓ రాజకీయ నేతతో పాటు మరో ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసిన చర్లపల్లి పోలీసులు వివరాలు వెల్లడించకుండా గోప్యంగా వ్యవహరించడంతో విషయం శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాల ప్రకారం.. సాయిచంద్రమౌళి, సరోజిని భార్యభర్తలు. కాగా మల్లాపూర్, బాపూజీనగర్‌లో నివాసం ఉంటున్నారు. 1982లో చర్లపల్లి, రైల్‌విహార్ కాలనీలో 327 గజాల విస్తీర్ణం కలిగిన ప్లాట్ నెంబరు 44ను కొనుగోలు చేసి తన భార్య సరోజిని పేరా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ క్రమంలో భార్య అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో అతడు బెంగుళూరులో ఉంటున్న కూమార్తె వద్ద ఉంటున్నాడు. వారం రోజుల క్రితం నగరానికి వచ్చిన అతడు తన ప్లాట్ వద్దకు వెళ్లి చూడగా.. సగభాగం నిర్మాణం చేసి ఉంది. దీంతో కంగుతిన్న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. చర్లపల్లికి చెందిన బీఆర్ఎస్ నేత జౌండ్ల వేణుగోపాల్‌రెడ్డి, తండ్రి అంజిరెడ్డి, మరోవ్యక్తి స్థానికంగా రియల్‌ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. ఈ క్రమంలో చర్లపల్లి, రైల్‌విహార్ కాలనీలో ప్లాట్ నెంబరు -44 చాలా రోజులుగా ఖాళీగా ఉండటాన్ని గమనించి ప్లాట్ వివరాలు సేకరించారు. సదరు ప్లాట్ యజమాని సరోజిని మృతిచెందినట్లు తెలుసుకుని ఆమె సంతకాన్ని ఫోర్జరీ చేసి బాండ్ పేపర్‌పై సాదా బైనామా తయారు చేసి వ్యాలిడేషన్ చేయించి మార్కెట్‌లో విక్రయించారని పోలీసులు చెప్పారు. సదరు ప్లాట్ ఇప్పటికే ముగ్గురు చేతులు మారినట్లు సమాచారం. నిందితుల్లో ఓ వ్యక్తి నిర్మాణం చేయడంతో విషయం బయటికి వచ్చింది. దీంతో పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకుని చర్లపల్లి జైల్‌కు తరలించినట్లు ఎస్సై శేఖర్ పేర్కొన్నారు.

గులాబీ జెండా ఆత్మగౌరవానికి ప్రతీక

ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



కైలాసగిరిలో జెండాను ఆవిష్కరించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు



కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి బీఆర్ఎస్ నేతలు

మేడిపల్లి: గులాబీ జెండా తెలంగాణ ఆత్మగౌరవానికి ప్రతీక అని పీర్జాదిగూడ నగర మేయర్ జక్క వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు బండారి రవీందర్‌లు అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరంలోని పలు డివిజన్‌లలో శనివారం ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. మల్కాజిగిరి బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసిన దార్శనికుడు నాడు కరెంటు సరఫరా సరిగ్గా లేక అంధకారంలో మగ్గి అతలాకుతలమైన తెలంగాణలో వెలుగులు విరజిమ్మేలా చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు అమలుకాని హామీలిస్తూ.. ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేటర్లు కొల్తూరి మహేష్, పోచయ్య, దొంతిరి హరిశంకర్‌రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు నిర్మల, నాయకులు, ఏనుగు మనోరంజన్‌రెడ్డి, శ్యామల సాయిలు, దావీద్‌ఖాన్, జగన్, ప్రశాంత్‌కుమార్, మల్లం వెంకటేష్‌గౌడ్, బండారి మల్లేష్, వెంకటేష్‌గౌడ్, పన్నాభాయ్, డివిజన్ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

కేసీఆర్ విజన్‌తోనే అభివృద్ధి..

కుషాయిగూడ: తెలంగాణ రాష్ట్ర ప్రదాత, మాజీ సీఎం కేసీఆర్ విజన్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధించిందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం హెచ్‌బీకాలనీ, కైలాసగిరిలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉద్యమనేతగా తెలంగాణ అవసరాలు తెలిసిన వ్యక్తిగా రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ప్రజలంతా ఆయన వెంటే ఉన్నారని వచ్చే రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు గుమ్మడి జంపాల్‌రెడ్డి, అశోక్, మల్లేష్‌గౌడ్, సాయికుమార్, శంకర్, నవీన్‌గౌడ్, రాజ్‌కుమార్, ఫర్వీన్, భారతి, జ్యోతి, అలివేలు, భూలక్ష్మి, స్వరూప, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు.

పీర్జాదిగూడలో..

మేడిపల్లి: బీఆర్ఎస్ పార్టీ 23వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని పీర్జాదిగూడ 25వ డివిజన్‌లో ఘనంగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా 25వ డివిజన్ కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్‌రెడ్డి అనంతరం మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి రాగిడి గెలుపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

అల్వాల్‌లో...

అల్వాల్: బీఆర్ఎస్ పార్టీ 23వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం అల్వాల్ ఈ–సేవ కేంద్రం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, ఎంబీసీ మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, కార్పొరేటర్లు శాంతిశ్రీనివాస్‌రెడ్డి, సబితాఅనిల్‌కిషోర్‌లు హాజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ సార్, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మజీ సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్‌తోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందిందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఘన విజయం సాధించడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు ధోలి రమేష్, అనిల్ కిషోర్‌గౌడ్, ఢిల్లీ పరమేష్, మల్లేష్‌గౌడ్, చంద్రశేఖర్, శోభన్‌బాబు, శ్రీనివాస్, లక్ష్మణ్‌యాదవ్, లోకేష్, రాజేందర్, యాదగిరిగౌడ్, సతీష్, వీణ, నందిని, సరిత, సులోచన తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను బలపరచండి !



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్య మైనంపల్లి



ఇంటింటి ప్రచారంలో మందుముల పరమేశ్వర్‌రెడ్డి



గౌతంనగర్ ప్రచారంలో కాంగ్రెస్ నేతలు

మల్కాజిగిరి: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బలపరచాలని మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు విజ్ఞప్తి చేశారు. ఆనంద్‌బాగ్‌లో మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని చర్చి పాస్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమం కోసం పాటుపడే ప్రభుత్వం వచ్చిందని, పార్లమెంట్‌లో కూడా ప్రభుత్వ వాణి వినిపించాలంటే పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందాలన్నారు. మల్కాజిగిరి అభ్యర్థి సునీతామహేందర్‌రెడ్డి గెలిపించాలని కోరారు. ఇండిపెండెంట్ చర్చిలను రెగ్యులైజేషన్ చేయడం, క్రిస్టియన్ కమ్యూనిటీకి భవన నిర్మాణం, క్రైస్తవుల శ్మశానవాటిక ఏర్పాటుకు స్థలం కేటాయించడానికి చర్యలు తీసుకోవాలని ప్లాస్టర్లు కోరారు. పాస్టర్లు ఫిలిప్, ఇసాక్ రాజు, సాధుజోషఫ్, మణి, శామ్యూల్, పద్మారావు, జాన్‌పాల్ పీసీసీ సెక్రటరీ అయూబ్‌ఖాన్, సంజీవ రెడ్డి, రాజేష్ యాదవ్, భరత్, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సుభాష్‌నగర్‌లో..

అల్వాల్: మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతమహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ కాంగ్రెస్ నేతలు సుభాష్‌నగర్‌లో శనివారం ప్రచారం చేశారు. హస్తం గుర్తుకు ఓటువేసి సునీతామహేందర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అశోక్‌రెడ్డి, కృష్ణగౌడ్, భాస్కర్, శేఖర్, శ్యామ్‌సుందర్, రఘునాథ్, శివకుమార్, రమేష్, నరేష్, మధు, కుమార్, బాల్‌నర్సింహ, లక్ష్మి తదితరులున్నారు.

గౌతంనగర్‌లో...

మల్కాజిగిరి నియోజకవర్గ బి –బ్లాక్ అధ్యక్షులు వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో గౌతంనగర్‌లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. హస్తం గుర్తుకు ఓటువేసి గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ గెలుపు ఖాయం..

ఉప్పల్: మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతామహేందర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని శనివారం ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి పరమేశ్వర్‌రెడ్డి, ఉప్పల్ లక్ష్మీనారాయణ కాలనీలో ప్రచారం నిర్వహించారు. దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని కావాలంటే మల్కాజిగిరి గెలుపు తథ్యమని అభిప్రాయపడ్డారు. లక్ష్మీనారాయణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, ఉప్పల్ కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి

ఉప్పల్ : ఉస్మానియా విశ్వవిద్యాలయ 107 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక పోటీల్లో ఉప్పల్ ప్రభుత్వ కళాశాల డిగ్రీ విద్యార్థి మెరుగు మహేష్ ఏక పాత్రాభినయం ప్రదర్శించి ప్రథమ బహుమతి సాధించాడు. ఈనెల 26 న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో మహేష్ తన అద్భుత నటనతో ఆకట్టుకుని ప్రథమ బహుమతిని కైవసం చేసుకున్నాడని ప్రిన్సిపల్ డా. సునీత తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి మహేష్‌ను కళాశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించారు.

అవార్డుల ప్రదానం



మల్కాజిగిరి: విద్యార్థుల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఫ్రోబుల్స్ గార్డెన్స్ పాఠశాల నిర్వాహకుడు శ్రీధర్ అన్నారు. 2023–24లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నతనం నుండే చదువు పట్ల శ్రద్ధ ఉండేలా తల్లితండ్రులు చూసుకోవాలన్నారు. వారిపై ఒత్తిడి లేకుండా చూడాల్సిన బాధ్యత కూడా వారిపై ఉందన్నారు. వేసవి సెలవులను వారికి ఆసక్తి ఉన్న రంగంలో శిక్షణ ఇప్పించడంతో పాటు వారిపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

రాగిడి గెలుపునకు కృషి చేయాలి..

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం



చిలుకానగర్‌లో చౌరస్తాలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ గీత



నాచారంలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నేతలు



ఇంటింటి ప్రచారంలో బొమ్మక్ విశ్వనాథ్

ఉప్పల్: ఉద్యమం చేసి కష్టపడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పాడు చేస్తుందని చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ ఆరోపించారు. ఈ మేరకు మల్కాజిగిరి పార్లెమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ.. డివిజన్ పరిధిలో అన్నపూర్ణ కాలనీ, చిలుకానగర్ చౌరస్తా, పలు ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మోసి చేసిందని విమర్శించారు. ప్రజల గుండెల్లో బీఆర్ఎస్ చిరస్థాయిగా ఉంటుందని రాగిడి లక్ష్మారెడ్డిని ప్రజలు భారీ మెజార్టీతో గెలిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, ఉప్పల్ ఎన్నికల ఇన్‌చార్జి జాహంగీర్, పల్లె నర్సింగరావు, జగన్ తదితరులు పాల్గొన్నారు.

బోడుప్పల్: బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని 19వ డివిజన్ ఇన్‌చార్జి బొమ్మక్ విశ్వనాథ్ అన్నారు. 19వ డివిజన్ పరిధిలోని బృందావన్ కాలనీలో శనివారం ఆయన ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని పేర్కొన్నారు. ప్రసాద్, హలీ ముద్దీన్, మహిళలు పాల్గొన్నారు.

మల్కాజిగిరి: మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపని ఆ పార్టీ సీనియర్ నాయకుడు బద్దం పరశురామిరెడ్డి అన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మల్కాజిగిరి చౌరస్తాలో పార్టీ జెండాను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాలుగు నెలల కాంగ్రెస్ పాలన గురించి ప్రజలు గమనించారని వచ్చే ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థుల ఓటమి ఖాయమన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్‌లో సత్తా చాటామని పార్లమెంట్ ఎన్నికల్లో కూడా సత్తాచాటుతామన్నారు. రాగిడి లక్ష్మారెడ్డి గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు జెఏసీ వెంకన్న, రాముయాదవ్, ఉస్మాన్, భాగ్యానంద్, ఉపేందర్, సిద్దిరాములు, సురేష్, నర్సింగ్, చంద్రమౌళి, కవిత, వైశాలి తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరుతూ.. ఆయన సతీమణి రాగిడి రజినిరెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతిసాయిజెన్‌శేఖర్‌లతో కలిసి శనివారం ప్రచారం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి రాగిడి లక్ష్మారెడ్డిని గెలిపించాలని కోరారు. స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో నిర్వహించిన వసంత సంగీత నృత్యోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శనివారం నిర్వహించిన కార్యక్రమంలో అన్నమాచార్య కీర్తనలు, అచ్యుతంకేశవం, ఆలోకయే బాలకృష్ణన్, జయ జయ గణనాథ, బ్రహ్మమూరారీ తదితర పాటలను కళాకారులు ఆలపించారు. అనంతరం నిర్వహించిన కూచిపూడి నృత్యం ఆహుతులను ఆకట్టుకుంది.

మేడే పోస్టర్ ఆవిష్కరణ

మల్లాపూర్: బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో తెలంగాణ భవన్‌లో నిర్వహించే మేడే కార్మికుల దినోత్సవానికి కార్మికులు హాజరై జయప్రదం చేయాలని బీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల మారయ్య అన్నారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నట్లు వివరించారు. శనివారం మల్లాపూర్‌లో బీఆర్‌టీయూ మేడే కార్యక్రమం పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. శ్రీనివాస్, రవి, తిరుమల, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వేముల మారయ్య

డ్రోన్ సాయంతో బయోకెమికల్ పిచికారీ



ఉప్పల్: ఆధునిక పద్ధతుల ద్వారా ఉప్పల్ నల్ల చెరువులో గుర్రపు డెక్కను కూకటి వేళ్లతో అధికారులు తొలగించే ప్రయత్నం చేశారు. ప్రత్యేకంగా తయారు చేసిన బయో కెమికల్‌ను డ్రోన్ల ద్వారా చల్లి నిర్మూలించే ప్రక్రియను ప్రారంభించారు. దీనిలో భాగంగానే శనివారం ఉప్పల్ డిప్యూటీ కమిషనర్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ఈపీటీఆర్ఐ సంస్థచే తయారు చేసిన సైంటిస్టు సూర్యనారాయణ నేతృత్వంలో మూడు డ్రోన్లతో బయోకెమికల్‌ను గుర్రపు డెక్కపై పిచికారీ చేశారు. దాదాపుగా 60 లీటర్ల కెమికల్ వాడి మొదటి రోజే సుమారుగా 16 ఎకరాల్లో కెమికల్‌ను పిచికారీ చేశామన్నారు. త్వరలో ఉప్పల్ నల్ల చెరువులోని 65 ఎకరాల్లో పూర్తిగా పిచికారీ చేయనున్నట్లు వివరించారు.

అత్తింటి ఎదుట కోడలు ధర్నా..

అల్వాల్: భర్త చనిపోయిన 4 నెలలకే కోడలును వేధింపులకు పాల్పడుతుండటంతో అత్తింటి ఎదుట కోడలు ఆందోళన చేసిన ఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మూసాపేట్‌కు చెందిన కళ్యాణితో అల్వాల్ వెంకటాపురానికి చెందిన కిషోర్‌కుమార్‌కు నాలుగేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఏడాదిన్నర కుమారుడు సంతానం. భర్త 4 నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా భర్త మరణానంతరం కోడలికి సంబంధించిన బంగారం, ఆస్తిపత్రాలు కోడలు వద్ద నుంచి తీసుకున్న అత్తింటివారు తిరిగి ఇవ్వకపోవడంతో ఆమె శనివారం వెంకటాపురంలోని అత్తింటి ఎదుట కొడుకుతో కలిసి ఆందోళనకు దిగింది. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తోంది.

ప్రయాణికుడి బ్యాగులో బంగారం చోరీ

12 తులాలు అపహరణ

అల్వాల్: ఆర్టీసీ బస్సులో ప్రయాణికుడి సంచీలో నుంచి 12 తులాల బంగారం దొంగతనానికి గురైన సంఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లాలాపేట్‌కు చెందిన ఉప్పలాంచి నాగయ్య (65) రైల్వే విశ్రాంత ఉద్యోగి. కాగా శుక్రవారం రాత్రి తన భార్య, అత్త, మరదలుతో కలిసి అల్వాల్ నంచి ఈసీఎల్‌కు వెళ్లేందుకు 24 ఎస్ ఆర్టీసి బస్సు ఎక్కాడు. రామకృష్ణపురం చెక్‌పోస్ట్ వద్దకు రాగానే తన పక్క సీటులో కూర్చున్న గుర్తుతెలియని మహిళ తనకు వాంతులు వస్తున్నాయని చెప్పి బస్సును ఆపి దిగి వెళ్లిపోయింది. అనంతరం నాగయ్య అనుమానం వచ్చి తన బ్యాగును తనిఖీ చేయడంతో బ్యాగులో పెట్టిన మరో చిన్న బంగారం సంచి మాయమైంది. తన పక్కనే ఉన్న మహిళ దొంగతనానికి పాల్పడి ఉండొచ్చని బాధితుడు వాపోయాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సరైన పత్రాలతో వాహనాలు తీసుకెళ్లండి !

కుషాయిగూడ: పలు కేసులకు సంబంధించి స్వాధీనం చేసుకున్న వాహనాల సరైన పత్రాలను చూపి వాహనాలను తీసుకెళ్లాలని కుషాయిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న 16 వాహనాలు కుషాయిగూడ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌లో ఉన్నాయన్నారు. సంబంధిత వ్యక్తులు వాహనాలకు సంబంధించి పత్రాలను చూపి వాహనాలను తీసుకెళ్లవచ్చని ప్రకటించారు.

నియామకం



మల్లాది కిషోర్

మల్కాజిగిరి: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా లోక్‌సత్తా పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్‌చార్జిగా మల్లాది కిషోర్ నియమితులయ్యారు. మల్లాది కిషోర్ మాట్లాడుతూ.. పార్టీ జాతీయ అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ, అధ్యక్షుడు శ్రీనివాసన్ ఆదేశాల మేరకు ఎంపీ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు పనిచేయడంతో పాటు పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటామన్నారు.

బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధం

మల్కాజిగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్



మల్లాపూర్‌లో రోడ్‌షోలో మాట్లాడుతున్న ఈటల రాజేందర్

మల్లాపూర్: మల్లాపూర్ డివిజన్ నోమా నుంచి బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్‌షోకు మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రజలను మోసం చేశాయన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్‌లకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రధాని మోదీ సమర్థవంతమైన విధానాలతో భారత్‌లో పేదరికం తగ్గిందని, భారత్ ప్రపంచ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిందన్నారు. మరోసారి నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కాకపోతే కాంగ్రెస్ ప్రభుత్వం మీద పోరాటం చేస్తామన్నారు. కమలం పువ్వు గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించాలని ఈటల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, స్థానిక బీజేపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గౌతంనగర్: మల్కాజిగిరి పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను గెలిపించాలని గౌతంనగర్ డివిజన్‌లో బీజేపీ నేతలు రాంబాబు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కమలం పువ్వు గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ఆయన కోరారు. దేవదాస్, మహేష్, ధనరాజ్, వికాస్, మంజుల తదితరులు పాల్గొన్నారు.



గౌతంనగర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నేతలు